# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 05 | సంచిక : 032
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
జనవరి 09, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## సమాజ చైతన్యంలో టీఎస్ జేయూ పాత్ర అభినందనీయం



2లో..

- వరంగల్ కలెక్టర్ సత్య శారద
- జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ



- వన దేవతల ఘన కీర్తి ప్రపంచానికి చాటాలి
- ప్రపంచ చరిత్రలో మైలు రాయిగా ఆలయ నిర్మాణం
- గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా పునరుద్ధరణ
- మేడారం అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

మేడారం ఖ్యాతి ఖండాంతరాలు దాటుతోంది. సమ్మక్క, సారలమ్మలను దర్శించుకునేందుకు తెలంగాణ నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. ఇక్కడికి వచ్చే భక్తుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూ వస్తోంది. దీంతో వన దేవతల ఘన కీర్తి ప్రపంచానికి చాటి చెప్పేలా రూ.251 కోట్లతో ఆలయ ప్రాంగణ పునరుద్ధరణ పనులను పూర్తి చేశారు. ప్రపంచానికి మూల పురుషులుగా ఉన్న ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, గొట్టు గోత్రాలు, ఆచారాలు ప్రతిబింబించేలా ఆలయాన్ని పునరుద్ధరించారు. పనుల విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భక్తుల అవసరాలే లక్ష్యంగా పూర్తి చేశారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో అమ్మవార్లను దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. గతంలో మాదిరిగా గంటల కొద్ది క్యూ లైన్లలో వేచి ఉండే పద్ధతికి స్వస్తి పలికి కేవలం పది నుంచి ఇరవై నిమిషాల్లోనే తనివితీర తల్లులను దర్శించుకునేలా ప్రత్యేక క్యూలైన్లను అందుబాటులోకి తెచ్చారు. ఈ జాతరలో సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల పాలరాతి విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి.

– వరంగల్ వాయిస్, ములుగు

# మేడారం ఖ్యాతి.. ఖండాంతరాలు దాటాలే



వివరాలు 2లో..

## పత్రికలు సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- 'వరంగల్ వాయిస్' క్యాలెండర్ ఆవిష్కరణ



8లో..



## ఐనవోలు జాతరకు పటిష్ట ఏర్పాట్లు

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**వరంగల్ వాయిస్, ఐనవోలు :** ఐనవోలు జాతరకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లను పూర్తిచేసి జాతర విజయవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. హనుమకొండ జిల్లా ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు ఈ నెల 13 నుంచి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో ఆలయం వద్ద చేసిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. (వివరాలు 8లో..)



8లో..

## క్షేమంగా గమ్యం చేరడమే లక్ష్యం

- ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

# మేడారం ఖ్యాతి.. ఖండాంతరాలు దాటాలే



- వన దేవతల ఘన కీర్తి ప్రపంచానికి చాటాలి
- ప్రపంచ చరిత్రలో మైలు రాయిగా ఆలయ నిర్మాణం
- గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా పునరుద్ధరణ
- మేడారం అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, ములుగు :** వన దేవతల ఘన కీర్తి ప్రపంచానికి చాటి చెప్పాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. ప్రపంచానికి మూల పురుషులుగా ఉన్న ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, గొట్టు గోత్రాలు, ఆచారాలు ప్రతిబింబించేలా ఆలయ ప్రాంగణం పునరుద్ధరణ జరుగుతోందన్నారు. మేడారం అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. శుక్రవారం ఎస్ఎస్. తాడ్వాయి మండలం మేడారం హరిత హోటల్ లో జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ లతో కలిసి సీతక్క మీడియా ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహించారు. నిత్యం అందుబాటులో ఉంటూ అభివృద్ధి పనులను అనుకున్న సమయంలో పూర్తి చేయించిన జిల్లా కలెక్టర్, ఎస్పీని మంత్రి అభినందించారు.

## రూ.251 కోట్లతో అభివృద్ధి..

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం రూ.251 కోట్లతో చరిత్రలో నిలిచిపోయేలా కని విని ఎరుగని రీతిలో మేడారం జాతర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. ఆలయ పునరుద్ధన విషయంలో గిరిజన పెద్దలు, పూజారులు, ఆదివాసి సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామని, అందరి సమ్మతి, సంతకాలతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మేడారం జాతరలో శాశ్వత ప్రతిపాదికన జరుగుతున్న అభివృద్ధి పనులు, జాతర నిర్వహణ అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మీడియా ప్రతినిధులను కోరారు.

## ఇంటి ఇలవేల్పులు..

భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా, ఇంటి ఇలావేల్పులుగా సమ్మక్క–సారలమ్మ దేవతలు ప్రసిద్ధి చెందారని సీతక్క వెల్లడించారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మాఘశుద్ధ పౌర్ణమి వెన్నెల వెలుగులలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, డోలు వాయిద్యాల నడుమ జిల్లా అధికారుల గౌరవ వందనంతో గిరిజన నృత్యాలతో వన దేవతలు గద్దెలపైకి రావడంతో భక్త జనం భక్తి పారవశ్యంతో పులకరిస్తారని పేర్కొన్నారు.
ఈ మహాద్భుత ఘట్టం ఆవిష్కృతం కోసం కోట్లాది మంది భక్తులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. జాతరలో మహిళా సంఘాల సభ్యులకు ప్రాధాన్యం ఇస్తూ వారికి బొంగు చికెన్, ఇప్ప పువ్వు లడ్డు ప్రత్యేక దుకాణాలు పెట్టించడం జరిగిందని తెలిపారు.

## 19న ప్రారంభం..

గద్దెల పునరుద్ధరన పూర్తి అయిందని, భక్తుల సందర్శనార్థం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 19వ తేదీ ఉదయం 7 గంటలకు ప్రారంభించనున్నట్లు సీతక్క తెలిపారు. 18వ తేదీ సాయంత్రమే సీఎం మేడారం చేరుకుంటారని పనులను పర్యవేక్షిస్తారని వెల్లడించారు. అత్యంత అట్టహాసంగా నిర్వహించనున్న గద్దెల ప్రారంభ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని మంత్రి సీతక్క కోరారు.

## భద్రతకు అత్యంత ప్రాధాన్యం..

తదనంతరం జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ మాట్లాడుతూ మేడారం జాతర సమయంలో భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమగ్ర ప్రణాళికతో ఏర్పాట్లు చేశామన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తాడ్వాయి – మేడారం, పసర – మేడారం రహదారుల వెంట ప్రతి రెండు కిలోమీటర్లకు ఒక చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. జాతర నిర్వహణకు సుమారు 20 మంది ఐపీఎస్ అధికారుల సేవలను వినియోగించుకుంటామన్నారు. భక్తులకు సేవలు అందించడానికి స్థానిక యువత సిద్ధంగా ఉన్నారన్నారు. వాహనాల పార్కింగ్ లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని అన్నారు. జాతర పరిసరాలను 450 సీసీ కెమరాలు, 20 ప్రత్యేక డ్రోన్స్ తో పర్యవేక్షణ చేస్తున్నామన్నారు.
గతంలో ఎన్నడూ లేని విధంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్ (ఏఐ) ద్వారా గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీని పర్యవేక్షించడం జరుగుతుందని పేర్కొన్నారు. క్రౌడ్ మేనేజ్‌మెంట్ కోసం 20కి పైగా డ్రోన్‌లను ఉపయోగిస్తూ, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని వివరించారు. అధునాతన సాంకేతికతను వినియోగిస్తూ ఏఐ ఆధారిత హీట్ మ్యాప్ టెక్నాలజీ ద్వారా అధిక జనసాంద్రత ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో జన సమూహ నియంత్రణ మరింత సమర్థవంతంగా సాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, వరంగల్, ములుగు మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## జాతరకు సిద్ధం.. : కలెక్టర్ టీఎస్.దివాకర

జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర మాట్లాడుతూ మేడారం జాతరను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. జాతర పనుల్లో ప్రస్తుతం ఐదు వేల మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని, జాతర సమయంలో 30వేల మంది సిబ్బంది, జాతర అనంతరం ఐదు వేల మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు. జాతర ప్రాంతాన్ని ఎనిమిది జోన్లుగా, 42 సెక్టార్లుగా విభజించి ప్రతి జోన్ లో ఎనిమిది మంది అధికారులు 24/7 విధులు నిర్వర్తించేలా ఏర్పాట్లు చేశామన్నారు.

# పల్లవి మోడల్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

- హాజరైన పర్వతగిరి ఎస్ఐ ప్రవీణ్, సర్పంచ్ మహేందర్



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** అన్నారంలోని పల్లవి మోడల్ స్కూల్‌లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి. పాఠశాల చైర్మన్ అశోక్ చారి, కరస్పాండెంట్ గంజి మహేందర్, డైరెక్టర్ కోటగిరి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పర్వతగిరి ఎస్ఐ ప్రవీణ్, అన్నారం సర్పంచ్ గాడిపెల్లి మహేందర్ హాజరయ్యారు. అతిథులు విద్యార్థులతో కలిసి గాలిపటాలు ఎగురవేసి, భోగి మంటల వద్ద సందడి చేస్తూ వారిని ఉత్సాహపరిచారు. అతిథులు మాట్లాడుతూ.. ఇలాంటి వేడుకల ద్వారా నేటి తరం విద్యార్థులకు మన భారతీయ సంప్రదాయాలు, పండుగల విశిష్టత తెలుస్తుందని కొనియాడారు. చదువుతో పాటు మన మూలాలను గౌరవించడం నేర్పడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సమాజ చైతన్యంలో టీఎస్ జేయూ పాత్ర అభినందనీయం

- వరంగల్ కలెక్టర్ సత్య శారద
- జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్బంగా అవగాహన ర్యాలీ

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** సమాజాన్ని చైతన్య పరచడంలో తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్ జేయూ) పాత్ర అభినందనీయమని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శుక్రవారం టీఎస్ జేయూ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగోని ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా కమిటీ అధ్యక్షుడు కందికొండ మోహన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా వరంగల్ చౌరస్తా నుంచి పోచమ్మ మైదాన్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ సత్య శారద, ప్రత్యేక ఆహ్వానితులుగా వరంగల్ డీటీఓ శోభన్, ట్రాఫిక్ సీఐ సుజాత, జాతీయ యువజన అవార్డు గ్రహీత సామాజికవేత్త మండల పరశురాములు, వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్, ఎన్సీసీ కెప్టెన్ సతీష్, ఇంతేజార్గంజ్ ఇన్ స్పెక్టర్ షుక్రు, మాట్టేవాడ ఇన్ స్పెక్టర్ కర్ణాకర్, ఎస్సైలు సందీప్, వెంకటేశ్వర్లు, రవికిరణ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని, మీ భద్రతను దృష్టిలో పెట్టుకొని వాహనాలను నడపాలని పలువురు సూచించారు.
ఈ కార్యక్రమంలో టీఎస్ జేయూ రాష్ట్ర నాయకులు తోకల అనిల్, నాగపురి నాగరాజు, నరేష్, వరంగల్ జిల్లా కమిటీ సభ్యులు బత్తుల సత్యం, కందికొండ గంగరాజు, ఈద శ్రీనాథ్, లింగ బత్తిని కృష్ణ, అడుప అశోక్, నాగపూరి అవినాష్, కౌడగాని మోహన్, నీరుటి శ్రీహరి, మంతెన సురేష్, రావుల నరేష్, 28వ డివిజన్ అధ్యక్షుడు సంపత్ కుమార్, ఏవీవీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, మోటివేటర్ బరుపాటి గోపి, ఎన్ సీసీ విద్యార్థులు ధ్రువ, పద్మావతి కాళాశాలల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి బాటలో 'పశ్చిమ'

- రూ. 1.50 కోట్లతో పనులకు శ్రీకారం
- రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ డివిజన్లలో రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. 5వ డివిజన్ కొత్తూరులో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టే పనులతో పాటు, 49వ డివిజన్ జూలైవాడ, రెవెన్యూ కాలనీల్లో రూ.1.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో నిర్లక్ష్యానికి గురైన కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించామని, ప్రజల దైనందిన సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు శాశ్వత ప్రాతిపదికన డ్రైనేజీ వ్యవస్థను



మెరుగుపరుస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించడమే కాకుండా, నిర్మాణంలో నాణ్యత పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, పెద్ద ఎత్తున కాలనీ వాసులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గాన్ని స్థానిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయ బృందం శుక్రవారం ఘనంగా సన్మానించింది. పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేకమల్ల వెంకటేష్, ఉపసర్పంచ్ బోట్ల శ్యామలతో పాటు వార్డు సభ్యులు కుమారస్వామి, శ్రీనివాస్, అరవింద్, లావణ్య, వెంకటేశ్వర్లు, మంజుల, రమలను ఉపాధ్యాయులు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుకూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు పాలకవర్గం ప్రత్యేక కృషి చేయాలని కోరారు. సన్మానం అనంతరం సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధితో పాటు విద్యకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణం, పరిశుభ్రత, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు తమ పాలకవర్గం కట్టుబడి ఉందన్నారు. ముస్త్యాలపల్లి పాఠశాలను నియోజకవర్గంలోనే ఒక ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పాఠశాల విద్యార్థినులు, గ్రామ మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలు సందడిని నింపాయి. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు సర్పంచ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పావని, సత్యపాల్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆగ్రంపహాడ్ 'మినీ మేడారం' జాతర ఏర్పాట్లపై ఏసీపీ సమీక్ష



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** జిల్లాలో 'మినీ మేడారం'గా ప్రసిద్ధి చెందిన ఆగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మ జాతర ఏర్పాట్లను పరకాల ఏసీపీ సతీష్ బాబు శుక్రవారం పరిశీలించారు. ఆత్మకూరు సీఐ సంతోష్‌తో కలిసి జాతర ప్రాంగణాన్ని విస్తృతంగా పర్యటించిన ఆయన, భక్తుల సౌకర్యార్థం తీసుకుంటున్న చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. జాతరకు భారీగా తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పార్కింగ్ స్థలాలు, క్యూ లైన్లు, కమాండ్ కంట్రోల్ రూమ్, పోలీసు చెక్ పోస్టులను ఏసీపీ తనిఖీ చేశారు. భక్తుల రాకపోకలకు ఆటంకం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ ప్లాన్, బస్టాండ్ వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ముఖ్యంగా అత్యవసర సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏసీపీ సతీష్ బాబు మాట్లాడుతూ.. "భక్తులకు శాంతియుత వాతావరణంలో దర్శనం కల్పించడమే మా ప్రథమ లక్ష్యం. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. రాత్రి వేళల్లో నిఘా పెంచేలా అదనపు సిబ్బందిని కేటాయిస్తున్నాం" అని తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ సంతోష్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాకతీయుల శిల్పకళా వైభవం అద్భుతం

- హిమాచల్ ప్రదేశ్ మంత్రి రోహిత్ ఠాగూర్
- ఓరుగల్లు కోటను సందర్శించిన మంత్రి బృందం
- కళాఖండాలను చూసి పరవశం

**వరంగల్ వాయిస్, ఖిల్లా వరంగల్:** కాకతీయుల రాజధాని, చారిత్రక ఓరుగల్లు కోటలోని శిలా తోరణం, కళాఖండాలు అద్భుతమని హిమాచల్ ప్రదేశ్ విద్యాశాఖ మంత్రి రోహిత్ ఠాగూర్ కొనియాడారు. శుక్రవారం ఆయన తన కుటుంబ సభ్యులు, ఐఏఎస్ అధికారుల బృందంతో కలిసి వరంగల్ రాతి కోటను సందర్శించారు. పర్యాటక శాఖ గైడ్ దేనబోయిన రవి యాదవ్ మంత్రి బృందానికి సాదర స్వాగతం పలికారు. కోటలోని ఒక్కో కళాఖండాన్ని చూపిస్తూ, నాటి కాకతీయ చక్రవర్తుల వీరగాథలను, శిల్పకళా విశిష్టతను క్షుణ్ణంగా వివరించారు. గైడ్ వివరణకు మంత్రి ముగ్ధులయ్యారు. ఈ సందర్భంగా ఖుష్ మహల్, ఏకశిల గుట్ట, స్వయంభూ ఆలయాలను మంత్రి సందర్శించారు. ముఖ్యంగా కాకతీయ సామ్రాజ్య చిహ్నమైన 'శిలా తోరణం' వద్ద మంత్రి రోహిత్ ఠాగూర్ ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. నాటి శిల్పుల నైపుణ్యం వెలకట్టలేనిదని ప్రశంసించారు. తమ వెంట



తెచ్చుకున్న కెమెరాల్లో కోట అందాలను, శిల్పాలను బంధించారు. అనంతరం రాతి కోటపై ఉన్న సెంటినల్ టవర్ (వాచ్ టవర్) పైకి వెళ్లి, అద్భుతమైన మెట్ల నిర్మాణాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "కాకతీయులు కేవలం యుద్ధ వీరులే కాదు, గొప్ప నిర్మాతలు కూడా. వారు నిర్మించిన చెరువులు, కోటలు, దేవాలయాలు నేటికీ చెక్కుచెదరకుండా ఉండటం వారి దూరదృష్టికి నిదర్శనం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ అధికారులు, పోలీసు సిబ్బందితో పాటు మిల్స్ కాలనీ సబ్ ఇన్‌స్పెక్టర్ నరేష్, రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పేదల ఆరోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం అత్యంత బాధ్యతతో వ్యవహరిస్తోందని, సహాయం కోసం వచ్చే ప్రతి అర్హుడికి అండగా నిలుస్తామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 81 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.25,86,500 విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. "అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సహాయం అందించడంలో మాకు రాజకీయాలు, పార్టీ భేదాలు లేవు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూస్తున్నాం" అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనపై విమర్శలు చేస్తూ, గతంలో సీఎం సహాయనిధి చెక్కుల కోసం ప్రజలు దళారీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, డబ్బులు ఖర్చు చేస్తే తప్ప పని జరగని పరిస్థితి ఉండేదని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ దుస్థితిని మార్చామని, లబ్ధిదారులకు రూపాయి ఖర్చు లేకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా వారి చేతుల్లోకి చెక్కులు అందుతున్నాయని స్పష్టం చేశారు. ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని, వాటిని వేగంగా పరిష్కరించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని నాయిని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో ఏ ఒక్క అర్హుడూ సహాయం అందలేదన్న ఆవేదన చెందకుండా బాధ్యత తీసుకుంటానని ఆయన భరోసా ఇచ్చారు.

## పరకాల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా ఏరుకొండ రవీందర్ గౌడ్



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** కాంగ్రెస్ సేవాదళ్ పరకాల నియోజకవర్గ అధ్యక్షుడిగా ఆత్మకూరు మండలానికి చెందిన ప్రముఖ నాయకుడు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్ నియామకమయ్యారు. ఈ మేరకు సేవాదళ్ జిల్లా అధ్యక్షులు బచ్చు చందర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దశాబ్ద కాలంగా పార్టీ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించారు. రవీందర్ గౌడ్ గతంలో ఆత్మకూర్ ప్రాథమిక వ్యవసాయ పరస్పర సహకార సొసైటీ చైర్మన్‌గా సమర్థవంతంగా పనిచేశారు. బీఆర్ఎస్ హయాంలో జిల్లాలోనే ఏకైక సొసైటీని కాంగ్రెస్ ఖాతాలో ఉంచిన ఘనత ఆయనకు ఉంది. అంతేకాకుండా, ఏరుకొండ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కోవిడ్ క్లిష్ట సమయాల్లో మాస్కులు, శానిటైజర్లు, వృద్ధులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేస్తూ ప్రజల్లో మంచి గుర్తింపు పొందారు. తన నియామకానికి సహకరించిన తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, జిల్లా అధ్యక్షులు బచ్చు చందర్, నియోజకవర్గ నాయకులకు రవీందర్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

## విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాల ప్రదానం



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం ఘనంగా జరిగింది. జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం మండల అధ్యక్షులు సముద్రాల విజేందర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఇటీవల 'వినియోగదారుల హక్కులు–విధులు' అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన రాత పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన భూక్య రామ్ చరణ్ (గోల్డ్ మెడల్) ప్రథమ బహుమతి, పరికరాల సాయి ప్రియ (సిల్వర్ మెడల్) ద్వితీయ బహుమతులను విజేతలకు సముద్రాల విజేందర్, కళాశాల ప్రిన్సిపల్ కవిత చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిత్య జీవితంలో మోసపోకుండా ఉండేందుకు ప్రతి విద్యార్థి వినియోగదారుల చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

4
WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శుక్రవారం, జనవరి 09, 2026

# ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్యలను కలిసిన టీఎన్జీఓ నేతలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా ఉద్యోగుల జేఏసీ చైర్మన్, టీఎన్జీఓ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు శుక్రవారం వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరిలను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. హనుమకొండలోని వారి నివాసంలో కలిసిన నాయకులు, ఎంపీ, ఎమ్మెల్యేలకు పుష్పగుచ్చాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఉద్యోగుల సమస్యలపై నేతలు వారితో కొద్దిసేపు చర్చించారు. ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందిస్తూ ఉద్యోగుల సంక్షేమానికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, సహాధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, జిల్లా ఉపాధ్యక్షులు రాజేశ్వర్ రెడ్డి, రాజేష్ ఖన్నా, జిల్లా బాధ్యులు రాజు, ఎర్ర ప్రగాఢ, అనూప్, నవీన్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# భారీగా నిషేధిత గుట్కా స్వాధీనం



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండల పరిధిలో పోలీసులు శనివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో భారీగా నిషేధిత గుట్కా, అంబర్ పొగాకు ఉత్పత్తులు పట్టుబడ్డాయి. గూడెప్పాడ్ సెంటర్‌లో నిర్వహించిన ఈ తనిఖీల్లో సుమారు రూ.21,000 విలువైన ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఆత్మకూరు సీఐ సంతోష్ వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఐ తిరుపతి తన సిబ్బందితో కలిసి గూడెప్పాడ్ సెంటర్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో ఎరుపు రంగు స్కూటీపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను గమనించి, వెనక్కి మళ్లి పారిపోయేందుకు ప్రయత్నించారు. అనుమానం వచ్చిన పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. స్కూటీని తనిఖీ చేయగా నాలుగు బ్యాగుల్లో నింపిన నిషేధిత అంబర్, గుట్కా ప్యాకెట్లు బయటపడ్డాయి. పట్టుబడిన నిందితులు కుదరబాద్‌కు చెందిన నారాల గోవింద్, అప్సరా బేగంగా గుర్తించారు. రాబోయే మేడారం జాతరను దృష్టిలో ఉంచుకుని, అక్కడ విక్రయించి సొమ్ము చేసుకోవాలనే ఉద్దేశంతో ఈ ఉత్పత్తులను తరలిస్తున్నట్లు నిందితులు విచారణలో అంగీకరించారు. పోలీసులు వారిని అరెస్ట్ చేసి, పొగాకు ఉత్పత్తులతో పాటు స్కూటీని కూడా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

# అంగన్‌వాడీ సేవలపై అవగాహన



**వరంగల్ వాయిస్, చిట్యాల :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని అందుకుతండా, ఒంటిప్పతండా గ్రామాల్లో శుక్రవారం 'ఆరోగ్యలక్ష్మి' కమిటీ సమావేశం ఉత్సాహంగా జరిగింది. అంగన్‌వాడీ టీచర్లు కస్తూరిబాయి, రజిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మాధవి, ఉప సర్పంచ్ శ్వేత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, ఇతర సేవలను వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ముగ్గురు చిన్నారులకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి అక్షరాభ్యాసం చేయించి విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. అర్హులైన లబ్ధిదారులకు బాలామృతం పాకెట్లు, కోడిగుడ్లను పంపిణీ చేశారు. గ్రామ అభివృద్ధిలో మరియు అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి సహకరిస్తున్న సర్పంచ్ మాధవి, ఉప సర్పంచ్ శ్వేతలను అంగన్‌వాడీ సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు రాజేందర్, స్థానిక మహిళలు, అంగన్‌వాడీ ఆయాలు పాల్గొన్నారు.

# తుఫాను బాధితులను తక్షణమే ఆదుకోవాలి

## 32వ డివిజన్‌లో ఇంటింటి సర్వే

**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** మోంథా తుఫాన్ వల్ల నష్టపోయిన వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందజేయాలని ఎంసీపీఐ (యూ) కరీమాబాద్ ఏరియా కార్యదర్శి ఐతం నగేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం కరీమాబాద్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో 32వ డివిజన్ ఎస్.ఆర్.ఆర్ తోట ప్రాంతంలో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ.. తుఫాన్ సమయంలో ఇళ్లలోకి నీరు చేరి బియ్యం, నిత్యావసర వస్తువులు కోల్పోయిన పేదలను అధికారులు సర్వే చేసి, రూ. 15,000 ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా అకౌంట్లలో పడలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నా.. ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని సర్వేలో వెల్లడైందన్నారు. డివిజన్‌లో పారిశుధ్యం పూర్తిగా పడకేసిందని, మోరీలు సక్రమంగా శుభ్రం చేయడం లేదని ప్రజలు ఫిర్యాదు చేసినట్లు



నగేష్ పేర్కొన్నారు. దీనికి తోడు కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉందని, ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారని చెప్పారు. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని, అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎగ్గని మల్లికార్జున్, ముక్కెర రామస్వామి, మాలి సత్యనారాయణ, చిప్ప సుశీల, బాబురావు, సుదర్శన్, స్వప్న, రజిత, రాజేశ్వరి, చంద్రకళ, బేగం, వీరాచారి పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి

## బీకేఎంయూ నేత తాటిపాముల వెంకట్రాములు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా పునరుద్ధరించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం తీసుకువస్తున్న కొత్త విధానాల వల్ల ఉపాధి హామీ నిధుల్లో కేంద్రం వాటా 90 శాతం నుంచి 60 శాతానికి తగ్గుతుందని, రాష్ట్రాల వాటా 10 నుంచి 40 శాతానికి పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల రాష్ట్రాలపై ఆర్థిక భారం పెరిగి, పేదలకు పని కల్పించే హక్కు దెబ్బతింటుందని విమర్శించారు. గ్రామసభల హక్కులను రద్దు చేసి, కేంద్రం నిర్ణయించిన ప్రాంతాల్లోనే పనులు చేయాలన్న నిబంధన కూలీలకు, చిన్న సన్నకారు రైతులకు గొడ్డలిపెట్టు అని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద వ్యవసాయ కూలీలకు రూ. 12 వేలు అందజేయాలని, మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయం అందించాలని, ఆసరా పింఛన్లను రూ.4 వేలకు పెంచి తక్షణమే అమలు చేయాలని, అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కపల్లి రమేష్, అధ్యక్షురాలు సిలువేరు విజయ, గడ్డం సంతోష్, చిలువేరు రవి, అంకూస్, పాలకుర్తి సారమ్మ, ఇస్తావత్ పూలమ్మ, ఎండి పర్వీన్, వినోద్, స్వరూప, ఉపేంద్ర, స్రవంతి పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుకు సిద్ధం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో పొదల నాగరాజు అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ.. కోట్లాది మంది గ్రామీణ పేదలకు జీవనాధారమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మార్చేసి, 'విబిజి రాంజీ' పథకాన్ని తీసుకురావడం సమంజసం కాదన్నారు. ఈ కొత్త విధానం వల్ల కూలీలు నష్టపోతారని, వెంటనే దీనిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నూతన విద్యుత్ సంస్కరణల వల్ల ఉచిత విద్యుత్, సబ్సిడీలు రద్దయ్యే ప్రమాదం ఉందని, దీనివల్ల సామాన్య ప్రజలపై మోయలేని భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని అబ్బాస్ విమర్శించారు. కేవలం వాగ్దానాలకే పరిమితం కాకుండా, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలకు వెంటనే నిధులు కేటాయించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపై పార్టీ శ్రేణులు నిరంతరం పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్, కమిటీ సభ్యులు కాసాని పుల్లయ్య, మైలారపు వెంకటేశ్వర్లు, ఇంజే వెంకటస్వామి, నామల యాదగిరి, శాగ యాదగిరి, కడారి ఐలయ్య, కడారి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ భక్త మార్కండేయ జయంతి ఉత్సవాలకు సన్నాహాలు

## భారీ శోభాయాత్రకు ఏర్పాట్లు

**వరంగల్ వాయిస్, హనుమకొండ/కాజీపేట :** హనుమకొండ జిల్లాలో శ్రీ భక్త మార్కండేయ జయంతి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం, పద్మశాలి పరపతి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 21 (బుధవారం) కాజీపేట సోమిడిలోని శ్రీ భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జనవరి 21న ఉదయం 9 గంటలకు సోమిడి మార్కండేయ గుడిలో స్వామివారికి అభిషేకం, హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. కుల బాంధవులందరూ అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు సోమిడి గుడి నుంచి భారీ శోభాయాత్ర ప్రారంభం కానుంది. ఈ యాత్ర సాయంత్రం 5 గంటలకు కాజీపేట సోమిడి గుడి నుంచి ప్రారంభమై, కాజీపేట చౌరస్తా, నిట్, ఫారెస్ట్ ఆఫీస్ జంక్షన్, నక్కలగుట్ట, మార్నాజీ స్కూల్, అశోక జంక్షన్, హన్మకొండ చౌరస్తా మీదుగా చారిత్రాత్మక వెయ్యిస్తంభాల గుడి వద్ద శోభాయాత్ర ముగుస్తుంది. ఈ జయంతి ఉత్సవాలకు పద్మశాలి కుల



బాంధవులందరూ కుటుంబ సమేతంగా విచ్చేసి విజయవంతం చేయాలని అఖిల భారత తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం, పరపతి సంఘాల జేఏసీ కన్వీనర్ Er.వైద్యం రాజగోపాల్, ప్రోగ్రాం కన్వీనర్ గుర్రపు కోటేశ్వర్ సంయుక్తంగా ఒక ప్రకటనలో కోరారు. పరపతి సంఘం అధ్యక్షులు గుర్రపు కోటేశ్వర్, కాజీపేట సంఘం నుంచి దేవులపల్లి సదానందం, మీడియా కార్యదర్శి పులికంటి రాజేందర్, తుమ్మ శ్రీనివాస్, రెడ్డి కాలనీ సంఘం నుంచి దుంపేటి నరేందర్, పద్మబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు క్రిష్ణ శాస్త్రి, పూజారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓరుగల్లులో సంగీత మహా యజ్ఞం

- 25న 'ఆచార్య దేవోభవ' మహోత్సవం
- భద్రకాళి ఆలయంలో పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సంగీతం, సంస్కృతి, గురు భక్తి సమ్మేళనంగా ఓరుగల్లు నగరంలో ఒక మహత్తర సంగీత వేడుకకు తెరలేవనుంది. స్వర సంస్కృతి సమర్పణలో, స్వర సంగమం మ్యూజిక్ లవర్స్ రిప్రజెంటేషన్ (SS-MLR) సంస్థ ఆధ్వర్యంలో 'ఆచార్య దేవో భవ – గురు గౌరవ మహోత్సవం' ఈ నెల 25న హనుమకొండలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన్‌లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి శుభారంభంగా శుక్రవారం శ్రీ భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ శేషు పోస్టర్‌ను ఆవిష్కరించి, కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు ఎం.ఎల్.రావు మాట్లాడుతూ.. జనవరి 25న ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిరంతరాయంగా ఈ సంగీత విభావరి కొనసాగుతుందని తెలిపారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమయ్యే ఈ ఉత్సవంలో అమరగాయకుడు ఘంటసాల గాన వైభవాన్ని చాటేలా అఖండ గానామృత ప్రవాహం సాగనుంది. యుగళ గీతాలు, బృంద గానాలు, కర్ణాటక సంగీత కచేరీలతో పాటు గురువులను సన్మానించే 'గురు గౌరవ' వేడుక ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఈ పోస్టర్ ఆవిష్కరణలో ప్రముఖ వాణిజ్యవేత్త గట్టు మహేష్ బాబు, స్వర సామ్రాట్ శరత్ చంద్ర, ప్రొఫెసర్ తిరుపతయ్య విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు తిరుపతయ్య, ఎస్సై రావెళ్ళ రామారావు, ఘంటసాల వేదిక అధ్యక్షులు మహేశ్వరం ఉపేందర్, ఐడల్ గంధర్వ సంచాలకులు బిటవరం శ్రీమన్నారాయణ, కవి నల్ల లక్ష్మీనారాయణ, వాగ్గేయకారులు మైస ఎర్రన్న పాల్గొన్నారు. వీరితో పాటు న్యాయవాది విప్పనపల్లి రవికుమార్, తడకమల్ల వాణిశ్రీ (సిరివెన్నెల పుష్పరాల మాల), మద్ది కాయల రాంబాబు (కాకతీయ కళావేదిక), పోతన చారి కర్ణకంటి (సాయి మీరా కళాక్షేత్ర), పలు సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు హాజరై తమ మద్దతు తెలిపారు. ఈ సంగీత యజ్ఞానికి కళాకారులు, సంగీతాభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని నిర్వాహకులు కోరారు.

## సత్యసాయి శత జయంతి శోభాయాత్ర



**వరంగల్ వాయిస్,వరంగల్ :** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి శోభాయాత్ర శుక్రవారం వరంగల్ నగరానికి చేరుకుంది. ఖమ్మం జిల్లా నుంచి ప్రారంభమైన ఈ రథయాత్రకు వరంగల్ సరిహద్దుల్లో భక్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఉదయం 10 గంటలకు శివనగర్‌లోని సత్యసాయి మందిరం నుంచి శోభాయాత్ర అత్యంత వైభవంగా ప్రారంభమైంది. రథయాత్ర పొడవునా భక్త బృందాలు బాబా వారి బోధనలను వివరిస్తూ సంకీర్తనలు చేశారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో సత్యసాయి సందేశాన్ని ప్రజలకు చేరవేశారు. ఈ యాత్ర శివనగర్ నుండి ప్రారంభమై అండర్ బ్రిడ్జి, చౌరస్తా, పోచమ్మ మైదానం, ఎంజీఎం కూడలి మీదుగా హన్మకొండకు చేరుకుంది. అక్కడి నుంచి కాజీపేట మీదుగా కరీంనగర్ జిల్లాకు కొనసాగుతుందని నిర్వాహకులు వెల్లడించారు. సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షులు గండి వెంకటేశ్వర్, వరంగల్ సమితి అధ్యక్షులు రాజేశ్వర్ రావు, హన్మకొండ అధ్యక్షులు వీరమల్ల కైలాష్, సుమతి నాయుడు, మాజీ కార్పొరేటర్ శామంతుల ఉషశ్రీనివాస్, సువర్ణ, నరేష్, అరుణ, బుదారపు భాస్కర్, యాదగిరి, రాజు సత్యసాయి సేవా సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఉద్యోగుల సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా విభాగం 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా విచ్చేసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన జిల్లా కార్యవర్గాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆగస్టు 15న ఉత్తమ సేవా పతకాలు పొందిన ఉద్యోగులను, ఇటీవల పదవీ విరమణ చేసిన వారిని, గ్రూప్ 1, 2, 3, 4 పరీక్షల్లో ఉద్యోగాలు సాధించిన కుల బాంధవులను సంఘం తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేముల శ్రీనివాస్, డీజీఎం బూర్ల కృష్ణ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పిట్ట ఉమాదేవి, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రపు రాజమౌళి, కోశాధికారి బూర తిరుపతయ్య, ఆర్గనైజేషన్ సెక్రటరీ కొండబత్తుల రాజమౌళి పాల్గొన్నారు.

# అసమానతలపై విద్యార్థి లోకం గర్జించాలి




**వరంగల్ వాయిస్, కేయూ:** దేశంలో వేళ్లూనుకుపోయిన కుల, మత, ఆర్థిక అసమానతలను రూపుమాపి, సమానత్వ సమాజ స్థాపన కోసం జరిగే పోరాటాల్లో విద్యార్థులు క్రియాశీలక పాత్ర పోషించాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు, పీడీఎస్ యూ పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రవి పిలుపునిచ్చారు. శుక్రవారం కాకతీయ యూనివర్సిటీలోని హ్యూమానిటీస్ బిల్డింగ్ హిస్టరీ సెమినార్ హాల్‌లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్ యూ) వరంగల్–హన్మకొండ జిల్లా 23వ మహాసభ జిల్లా అధ్యక్షులు అలువాల నరేష్ అధ్యక్షతన నిర్వహించారు. మహాసభను ప్రారంభించిన కొత్తపల్లి రవి మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని రేవంత్ ప్రభుత్వం విద్యార్థులకు, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ప్రపంచ దేశాలు శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకుపోతుంటే, మోదీ ప్రభుత్వం మాత్రం విద్యార్థుల మెదళ్లలో కాలం చెల్లిన తిరోగమన భావాలను, కుల మత విషబీజాలను నాటుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ లౌకిక వ్యవస్థను కాపాడుకోవడానికి విద్యార్థులు మతోన్మాద ఫాసిజాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలకు లాభం చేకూర్చేలా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు సంఘటితంగా ఉద్యమించాలని కోరారు. మహాసభ ప్రారంభానికి ముందు అలువాల నరేష్ సంఘం జెండాను ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నరసింహారావు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి ప్రతినిధులు రెండు నిమిషాలు మౌనం పాటించి విద్యార్థి అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం 23 మంది సభ్యులతో కూడిన వరంగల్–హన్మకొండ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ రాష్ట్ర నాయకులు పి.అనూష, జిల్లా నాయకులు వినయ్, సంగీత, వంశీ, కార్తీక్, కేయూ అధ్యక్షులు బి.బాలకృష్ణ, నాయకులు వెంకటేష్, యశ్వంత్, షరీఫా, ప్రసన్న, స్వాతి, లావణ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## టీపీయూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా విభాగానికి చెందిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కాకతీయ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ శుక్రవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ మాట్లాడుతూ.. కుల బాంధవులకు, పేదలకు ఏదో ఒక రూపంలో సేవలు అందిస్తూ తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం నిత్యం ప్రజల్లో ఉండటం అభినందనీయమని కొనియాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సంఘం నిర్వహిస్తున్న పలు సామాజిక కార్యక్రమాలను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ కార్యవర్గాన్ని అభినందించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మొదటిసారి ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో అన్ని వివరాలతో కూడిన పూర్తిస్థాయి క్యాలెండర్‌ను ముద్రించడం సంతోషకరమని పేర్కొన్నారు. జిల్లా కార్యవర్గం ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు కోడం రవి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గుర్రపు రాజమౌళి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దేవులపల్లి సాయిరాజ్, కోశాధికారి బుర్ర తిరుపతయ్య, ఆర్గనైజేషనల్ కార్యదర్శి కొండబత్తుల రాజమౌళి పాల్గొన్నారు. వీరితో పాటు అసోసియేట్ ప్రెసిడెంట్ కొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చిందం లింగమూర్తి, తాటి దామోదర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు కుడికాల సత్యనారాయణ, గడ్డం రాజకుమార్, వోడ్నాల వెంకటస్వామి, ముదుతనపల్లి రమేష్ మరియు పలువురు సంఘం సభ్యులు హాజరయ్యారు.

## రేపే జాతర వేలం పాటలు



**వరంగల్ వాయిస్, పాలకుర్తి (బమ్మెర):** జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెర గ్రామంలో కొలువైన శ్రీ ఆలేటి ఎల్లవ్వ తల్లి జాతర ఏర్పాట్లలో భాగంగా శనివారం ఉదయం 10:00 గంటలకు వేలం పాటలు నిర్వహించనున్నారు. ప్రతి సంవత్సరం కనుమ పండుగ సందర్భంగా నిర్వహించే ఈ జాతరను పురస్కరించుకుని బమ్మెర గ్రామ పంచాయతీ ఆవరణలో బహిరంగ వేలం పాటలు జరుగుతాయని సర్పంచ్ జిట్టబోయిన రమ్య–ప్రశాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. జాతర సమయంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా బ్బరికాయల విక్రయాలు, వాహనాల పార్కింగ్ కేంద్రాలు, దుకాణాల ఏర్పాటు (స్టాళ్లు), స్పెషల్ దర్శనం టికెట్ల కౌంటర్, అమ్మవారి ప్రసాదం విక్రయాలకు వేలం నిర్వహించనున్నారు. వీటిని వేలంలో దక్కించుకోవాలనుకునే ఆసక్తి గల వ్యక్తులు రేపు ఉదయం నిర్ణీత సమయానికి బమ్మెర గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకోవాలని కోరారు.

## జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు 'కానిపర్తి' కుర్రాళ్లు



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం కానిపర్తి గ్రామం క్రీడారంగంలో తన ప్రత్యేకతను చాటుకుంటోంది. ఈ గ్రామానికి చెందిన ఐదుగురు క్రీడాకారులు జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికై గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. ఈ నెల 14 నుంచి 17 వరకు చెన్నైలో జరగనున్న 'ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్'లో వీరు తమ ప్రతిభను చాటనున్నారు. కాకతీయ యూనివర్సిటీ తరపున సందెల అజయ్, కథర్ల గణేష్, పొలబోయిన వికాస్, కన్నెబోయిన సిద్ధార్థ ఎంపికైనట్లు కేయూ ఫిజికల్ డైరెక్టర్ పి.మధు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, ఇదే గ్రామానికి చెందిన సీనియర్ ప్లేయర్ మరియు కోచ్ దాసరి రమేష్ కుమారుడు రాజు, జేఎన్‌టీయూ హైదరాబాద్ తరపున ఈ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనబోతున్నాడు. ఒకే గ్రామం నుంచి ఐదుగురు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడంపై కానిపర్తిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సీనియర్ క్రీడాకారులు రమేష్, కుమార్, శ్రీనివాస్, గ్రామస్థులు క్రీడాకారులను అభినందిస్తూ, వారు జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని డోర్నకల్ మండల పరిధిలోని కన్నెగొండ్ల, డోర్నకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి గ్రామీణ సంస్కృతి ప్రతిబింబించేలా పాఠశాల ప్రాంగణంలో వేడుకలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థినులు రంగురంగుల ముగ్గులు వేయగా, ఉపాధ్యాయులు భోగి మంటలు వేసి, పొంగలి వండి పండుగ విశిష్టతను చాటారు. చిన్నారి విద్యార్థులకు భోగి పళ్లు పోసి, వారు ఆయురారోగ్యాలతో విద్యాబుద్ధులు నేర్చుకోవాలని ఉపాధ్యాయులు దీవించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోతూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) లక్ష్మ మాట్లాడుతూ.. మన భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు సంక్రాంతి పండుగ ప్రతీక అని తెలిపారు. ఈ సంబరాల్లో ఉపాధ్యాయులు నరసయ్య, కోవిలా రాజేశ్వర్, వెంకన్న, శ్రీనివాస్, రామకృష్ణ, లోకేందర్, దస్తగిరి, నరేందర్, శేఖర్, వాణిశ్రీ, నాగమణి, ఉరియ, దమయంతి, అనిత, అమీనా, సమిత, మంజులత, శేషు కుమారి, కమల, వసంత రాణి, వరలక్ష్మి, సలోమి, సింధు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నైన్ పాకలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు




**వరంగల్ వాయిస్, చిట్యాల :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని నైన్ పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల గైర్హాజరును తగ్గించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపారు. శుక్రవారం చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు, స్థానిక పోలీసులు కలిసి బడికి రాని విద్యార్థుల ఇళ్లను స్వయంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్.ఊర్మిళ, చిట్యాల ఎస్సై శాఖాన్ తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఏ.ఎస్సై యాదగిరి, చైల్డ్ వెల్ఫేర్ అధికారి సోషల్ కుమార్, ఎన్జీఓ ప్రతినిధి కోమల పాల్గొన్నారు. బృందంగా వెళ్లిన అధికారులు విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులకు కూడా సూచనలు చేశారు. పోలీస్ సిబ్బంది అశోక్, శ్రీనివాస్, మౌనిక, క్రాంతి కుమార్, సీఆర్పీ తిరుపతితో పాటు ఉపాధ్యాయులు సుధాకర్, ప్రణీత, పల్లవి, ప్రవీణ్ కుమార్, రాజయ్య, ప్రసాద్, నాగరాజు, విజయవర్ధన్ రెడ్డి, లోక శ్రీనివాస్, కోటేశ్వరరావు, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

# ఒగ్లాపూర్‌లో మాల్దీవుల ప్రతినిధుల బృందం



**వరంగల్ వాయిస్, దామెర :** తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్'లో భాగంగా మాల్దీవుల ఐలాండ్ కౌన్సిల్ అధికారులు శుక్రవారం హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ఒగ్లాపూర్ గ్రామ పంచాయతీని సందర్శించారు. ఈ అంతర్జాతీయ ప్రతినిధుల బృందం గ్రామంలో అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామంలో నిర్మించిన పౌల్ట్రీ షెడ్లను ప్రతినిధులు సందర్శించారు. గ్రామీణ అభివృద్ధిలో తెలంగాణ అనుసరిస్తున్న వ్యూహాలు బాగున్నాయని వారు కొనియాడారు. దామెర ఎంపీడీవో గుమ్మడి కల్పన, ఒగ్లాపూర్ సర్పంచ్ కేతిరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఉపసర్పంచ్ కిన్నెర దినేష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ఇంజపెల్లి నరేష్, కోఆర్డినేటర్ అరుణ్, డీఆర్డీఏ ప్రతినిధి నరసింహారెడ్డి, సంపత్ కుమార్, శ్రీనివాస్, ఏపీఓ శారద పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, దామెర :** కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, హామీల అమలులో వైఫల్యంతో విసిగిపోయిన పలువురు నాయకులు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారని పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి అన్నారు. శుక్రవారం దామెర మండలం ఊరుగొండ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఆయా పార్టీలకు రాజీనామా చేసి, చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రజలకు నిజమైన న్యాయం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ప్రజలు మోసపోతున్నారని, అందుకే క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారికి సముచిత గౌరవం, బాధ్యతలు ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో కూనాటి రామకృష్ణా రెడ్డి, భూపతి రమేష్, కానాల కిషన్ రావు, ముక్కెర సాంబయ్య, నల్ల సాంబయ్య, కొడకండ్ల మల్లారెడ్డి, లక్కిడి రవీందర్ రెడ్డి, గురజాల రాజు, చెట్టుపెల్లి మహేందర్, ఒడుదుల పవన్, లింగంపల్లి సురేష్, జన్ను రాజేందర్, గొల్లపల్లి వినయ్, కన్నెబోయిన ఓదెలు, నానెబోయిన అనిల్, ఒడుదుల మధుకర్ తో పాటు బీజేపీ నాయకులు నానబోయిన రాజయ్య తదితరులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, యూత్ విభాగం ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రిజర్వేషన్లు సాధించాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు బింగి శ్రీనివాస్ విమర్శించారు. శుక్రవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యామ్ యాదవ్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీసీ జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యని బింగి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో బింగి శ్రీనివాస్ ప్రసంగిస్తూ.. కామారెడ్డి డిక్లరేషన్ సాక్షిగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మబలికిందని, కానీ ఇప్పుడు బీసీలను మోసం చేస్తూ ఎన్నికలకు వెళ్తోందని మండిపడ్డారు. రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు బీసీ సంఘాలన్నీ ఏకమై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. బీసీల ఆత్మగౌరవం కాపాడేందుకు ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో ఉద్యమించాలని కోరారు. బీజేపీ బీసీ నాయకులు పేరుగు సురేష్, రావులకార్ సురేష్, బీసీ జాతీయ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరోపణలు కాదు.. అభివృద్ధి చేయాలి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో గిరిజనులు చేస్తున్న ఆందోళనల వెనుక బిఆర్ఎస్ పార్టీ హస్తం ఉందంటూ కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు కత్తెరశాల విద్యాసాగర్ మండిపడ్డారు. శుక్రవారం స్థానిక బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ నాయకుల తీరుపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ హయాంలో అప్పటి ఎమ్మెల్యే రెడ్యానాయక్ చొరవతో, ప్రజల విజ్ఞప్తి మేరకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ డోర్నకల్‌ను మున్సిపాలిటీగా మార్చారని గుర్తు చేశారు. అప్పుడు సంతకాలు సేకరించిన నాయకులే నేడు కాంగ్రెస్ గూటికి చేరి తండాల అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా.. కనీసం మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరాను కూడా పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ఆగిపోయిన కూరగాయల మార్కెట్ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించడం ద్వారానే డోర్నకల్ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పోటు జనార్ధన్, యశోధర్ జైన్, మన్యుపాట్ని, రాంబద్రం, మియా, కొత్త వీరన్న, కొత్త కుమార్, మల్లేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఆత్మకూరులో మాల్దీవుల ప్రతినిధుల బృందం సందడి

- ఉపాధి హామీ పనులపై ప్రశంసల జల్లు

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న 'లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్'లో భాగంగా మాల్దీవుల ఐలాండ్ కౌన్సిల్ అఫీషియల్స్ బృందం శుక్రవారం ఆత్మకూరు మండలంలో పర్యటించింది. 35 మంది సభ్యులతో కూడిన ఈ అంతర్జాతీయ ప్రతినిధుల బృందం మండలంలోని అగ్రంపహాడ్, ఆత్మకూరు గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన ఆయిల్ పామ్ సాగు, కొబ్బరి తోటలు, అజోల్లా యూనిట్లు, కంపోస్ట్ యార్డులను ప్రతినిధులు ఆసక్తిగా గమనించారు. ముఖ్యంగా డ్రైయింగ్ ప్లాట్‌ఫామ్, ఫామ్ పాండ్‌లో చేపల పెంపకం చేపట్టిన తీరును వారు ప్రశంసించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్న విధానం బాగుందని అధికారులను, సిబ్బందిని అభినందించారు. అనంతరం గొల్లవాడలోని ప్రభుత్వ పాఠశాల మరియు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ప్రతినిధులు, అక్కడి పిల్లలతో కాసేపు ముచ్చటించి వారిని ఉత్సాహపరిచారు. ఆత్మకూరు గ్రామ పంచాయతీ 'స్వచ్ఛ భారత్



మిషన్', 'ఈజీఎస్' విభాగాల్లో జాతీయ స్థాయి అవార్డులు పొందేలా కృషి చేసిన సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజును, గ్రామ కార్యదర్శిని వారు ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రతినిధులు పూర్తి సమాచారాన్ని తెలుసుకున్నారు. ఈ పర్యటనలో స్థానిక సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు, నిర్డ్ కోర్సు కోఆర్డినేటర్లు అరుణ్, శిరీష, ఏవీవో నరసింహారెడ్డి, ఏపీవోలు రాజిరెడ్డి, శారద, ఎస్బీఎం కోఆర్డినేటర్లు సంపత్ కుమార్, శ్రీనివాస్, మహేందర్, ఈసీ రాము, పంచాయతీ కార్యదర్శులు శ్వేత, అరుణ, సుధాకర్, శ్రీధర్, సురేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# ఫర్వాలేదనిపించుకున్న రాజాసాబ్





బాహుబలి తర్వాత లార్జర్ దేన్ లైఫ్ తరహా సినిమాలతోనే ప్రయాణం చేస్తున్నారు ప్రభాస్. ఫ్యాన్స్ ఆయనను వింటేజ్ డార్లింగ్ లుక్ లో చూసి చాలా కాలమైయింది. ఆ లోటుని భర్తీ చేసే సినిమా 'రాజాసాబ్' అని స్వయంగా డైరెక్టర్ మారుతి చెప్పడం, కెరీర్ లో తొలిసారి ప్రభాస్ ఒక హారర్ ఫాంటసీ స్జబెక్ట్ ని ఎంచుకోవడం, ప్రచార చిత్రాలు ఆసక్తిని రేపడం, సంక్రాంతి రేసులో తొలి సినిమాగా రావడంతో మంచి హైప్, అంచనాలు ఏర్పడాయి. రాజు అలియాస్ రాజాసాబ్ (ప్రభాస్) కు అమ్మానాన్న అన్నీ నాయనమ్మ గంగాదేవి(జరీనా వహాబ్)నే. గంగాదేవికి ఆల్జీమర్స్. ప్రతి విషయాన్ని మర్చిపోతుంటుంది. కాకపోతే ఎప్పుడో తనని విడిచిపెట్టి వెళ్ళిపోయిన భర్త కనకరాజు (సంజయ్‌దత్) ని మాత్రం గుర్తుపెట్టుకుంటుంది. తాత కనకారాజు కోసం వెదుకుతున్న రాజుకు కొన్ని సంచలన నిజాలు తెలుస్తాయి. నర్సాపూర్ అడవిలోని ఓ రాజమహల్ వున్నాడనే సంగతి తెలుసుకుంటాడు.


ఆ రాజమహల్ అడుగుపెట్టిన రాజుకి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి ? కనకరాజు గురించి ఎలాంటి నిజాలు తెలుసుకున్నాడు? అసలు గంగాదేవి గతం ఏమిటి? కనకరాజు గంగాదేవిని ఎందుకు వదిలివెళ్ళిపోయాడు? తన లక్ష్యం ఏమిటి? నాయనమ్మ కోసం రాజు ఎలాంటి పోరాటం చేశాడనేది మిగతా కథ. నాయనమ్మకి జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకున్న మనవడి కథ ఇది. ఒక హారర్ ఫాంటసీ సరిపడే ముడిసరకు ఈ కథలో పుష్కలంగా వుంది. హిప్నాటిజంతో పాటు తాంత్రిక విద్యలు తెలిసిన విలన్ ని తన మనోబలంతో హీరో ఎలా జయించాడనే పాయింట్ బలమైనదే. కాకపోతే ఇందులో సంఘర్షణ, సన్నివేశాలు, కథనం అల్లిన తీరు ఇంకా ప్రభావవంతంగా ఉండాల్సింది. సత్య పాత్ర రాజ్ మహాల్ ప్రవేశం, అక్కడ జరిగిరే సన్నివేశాలు థ్రిల్లింగ్ ఫీలింగ్ కలిగిస్తూ సినిమా కథ మొదలౌతుంది. ఈ సీక్వెన్స్ రాజాసాబ్ పై అంచనాలు పెంచుతుంది. రాజు పాత్రలో ప్రభాస్ ఎంట్రీ ఆ తర్వాత వచ్చే పాట వింటేజ్ డార్లింగ్ ని గుర్తు చేస్తుంది. తర్వాత తాతని వెదికే క్రమంలో వచ్చే సన్నివేశాలు సాదాసీదాగా సాగుతాయి. హీరోయిన్స్ ట్రాక్స్ సరిగ్గా వర్క్ అవుట్ కాలేదు. రాజు పాత్ర మహాల్ లోకి ఎంట్రీ ఇస్తేనే అసలు కథ మొదలౌతుంది. కాకపోతే ఆ ఘట్టానికి రావడానికి ఇంటర్వెల్ వరకూ ఎదురుచూసేలా చేశారు. దీంతో అప్పటివరకూ సాగదీసిన ఫీలింగ్ కలుగుతుంది.కనకరాజు పాత్రలో సంజయ్ దత్ చేసే హిప్నటిజం ఆడియన్స్ కి ఇంకా బలంగా రిజిస్టర్ చేయాల్సింది. బోమన్ ఇరానీ పాత్ర వచ్చే వరకూ చాలా విషయాలు కన్ఫ్యుజన్ లోనే వుంటాయి. అలాగే ఆ మహల్ ప్రవేశించిన పాత్రలు పెద్ద సవాళ్లు ఎదురుకావు. కామెడీ కూడా సరిగ్గా వర్క్ అవుట్ కాలేదు. దీంతో ఆడియన్స్ కి జరుగుతున్న సంఘటనలపై ఆసక్తి తగ్గుతుంది. కాకపోతే ప్రీక్లైమాక్స్ క్లైమాక్స్ సినిమాకి ఆయువు పట్టుగా నిలిచాయి. ఆ సన్నివేశాలు ఉత్కంఠభరితంగా తీర్చిదిద్దారు. ప్రభాస్ మళ్ళీ వింటేజ్ లుక్ లో చూడటం ఆయన ఫ్యాన్స్ ని ఖుషి చేస్తుంది. చాలా కాలం తర్వాత ఫన్ బాడీ లాంగ్వేజ్, ఁ□ట్స్, డ్యాన్సులు.. ఇలా కలర్ ఫుల్ అవతార్ లో కనిపించారు. సంజయ్ దత్ పర్సనాలిటీ ఆ క్యారెక్టర్ కి ప్లస్ అయ్యింది. కాకపోతే ఆ పాత్రని ఇంకా బలంగా రాయాల్సింది. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ తెరపై అందంగా కనిపించారు. అయితే ఆ పాత్రలు కథలో మిళితం కాలేదు. జరీనా వాహెబ్ తన అనుభవం చూపించారు. వీటీవీ గణెళిష్, సప్తగిరి, ప్రభాస్ శ్రీను, సత్య.. అక్కడక్కడ నవ్వించారు.

## మొసలి బొమ్మలతో ప్రభాస్ అభిమానుల సందడి

ప్రభాస్ నటించిన 'ది రాజాసాబ్' నేడు ప్రేక్షకుల ముందుకొచ్చి సందడి చేస్తోంది. ఈ సినిమా ట్రైలర్ విడుదలైన నాటి నుంచి మొసలి మీమ్స్ సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. నేడు ఈ చిత్రం విడుదల కావడంతో కొందరు అభిమానులు ఏకంగా మొసలి బొమ్మలను థియేటర్‌లలోకి తీసుకెళ్లి హంగామా చేస్తున్నారు. క్లైమాక్స్‌లో ప్రభాస్ మొసలితో ఫైట్ చేసే సన్నివేశం థియేటర్‌లో వచ్చే సమయంలో ఆ బొమ్మలతో స్క్రీన్ వద్దకు వెళ్లి దాన్ని రీక్రియేట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి. అయితే కొందరు మాత్రం ఇవి ఏఐతో చేసిన వీడియోలంటూ కామెంట్స్ పెడుతున్నప్పటికీ ఈ సినిమా విడుదల సందర్భంగా మొసలి మాత్రం హైలైట్ అవుతోంది. 'ఎవర్రా మీరంతా..', 'ఇది మొసళ్ల పండగ' అంటూ నెటిజన్లు ఫన్నీ కామెంట్స్ పెడుతున్నారు.

# ఆస్కార్ రేసులో ఇండియన్ ఫిలిమ్స్




## ముందున్న కాంతారా, మహావతార్ నరసింహ

సినీ ఇండస్ట్రీలో ప్రతిష్టాత్మకంగా భావించే 98వ ఆస్కార్ అవార్డుల సందడి మొదలైంది. అంతర్జాతీయ వేదికపై అప్పుడే మొదలైంది. తాజాగా అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ విడుదల చేసిన 'రిమైండర్ లిస్ట్'లో భారత్ నుండి ఏకంగా నాలుగు చిత్రాలు చోటు దక్కించుకుని సంచలనం సృష్టించాయి. మొత్తం 201 చిత్రాలతో కూడిన ఈ జాబితాలో నిలిచిన సినిమాలు 'ఉత్తమ చిత్రం' కేటగిరీలో పోటీ పడేందుకు అర్హత సాధించాయి. ఇందులో రిషబ్ శెట్టి దర్శకత్వంలో వచ్చిన కన్నడ బ్లాక్ బస్టర్ 'కాంతార: ఎ లెజెండ్ చాప్టర్ 1' గ్లోబల్ స్థాయిలో తన పట్టు నిలుపుకోగా, అనుపమ్ ఖేర్ దర్శకత్వం వహించిన హిందీ చిత్రం 'తన్వి ది గ్రేట్' ఆస్కార్ రేసులో నిలిచి అందరినీ షాక్‌కి గురిచేసింది. ఇక వీటితో పాటు భారతీయ పురాణ నేపథ్యంలో వచ్చిన బహుభాషా యానిమేషన్ చిత్రం 'మహావతార్ నరసింహ', నూతన దర్శకుడు అభిషన్ జీవింత్ తెరకెక్కించిన తమిళ చిత్రం 'టూరిస్ట్ ఫ్యామిలీ' కూడా ఈ అర్హత జాబితాలో చోటు దక్కించుకున్నాయి. రాధికా ఆప్టే నటించిన 'సిస్టర్ మిడ్‌నైట్' సైతం ఈ పోటీలో ఉండటం విశేషం. మరోవైపు భారత్ నుంచి అధికారికంగా పంపబడిన నీరజ్ ఘైవాన్ చిత్రం 'హోమ్‌బౌండ్' ఇప్పటికే 'ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్' కేటగిరీలో టాప్`15 షార్ట్‌లిస్ట్‌లో నిలిచి భారీ ఆశలు రేకెత్తిస్తోంది.

ఆస్కార్ నిబంధనల ప్రకారం.. ఈ చిత్రాలన్నీ 2025లో అమెరికాలోని ప్రధాన మెట్రోపాలిటన్ ఏరియాల్లో కనీసం ఏడు రోజులు థియేటర్లలో ప్రదర్శితమై ఉండటంతో పాటు ఆస్కార్ అకాడమీ సూచించిన 'ఇన్‌క్లూజన్ స్టాండర్డ్స్' ప్రమాణాలను విజయవంతంగా పూర్తిచేశాయి. అయితే ఈ జాబితాలో ఉన్నంత మాత్రాన నామినేషన్ దక్కినట్లు కాదని, అకాడమీ సభ్యుల రహస్య ఓటింగ్ పక్రియ తర్వాతే అసలు విజేతలు ఎవరో తెలుస్తుందని గుర్తుంచుకోవాలని సినీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఈ ఉత్కంఠకు తెరదించుతూ 2026 జనవరి 22న తుది నామినేషన్ల జాబితాను అకాడమీ ప్రకటించనుంది. ఇక ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూసే 98వ ఆస్కార్ అవార్డుల ప్రధానోత్సవ వేడుక మార్చి 15న లాస్ ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్లో వైభవంగా జరగనుంది.




## యాక్షన్ మోడల్‌లో సమంత సూపర్బ్

చూస్తా ఉండండి.. మా ఇంటి బంగారం మీ అందరితో కలిసిపోతుంది..' అంటూనే ఫుల్ యాక్షన్ మోడ్‌లో అదరగొడుతున్నారు సమంత. ఆమె ప్రధానపాత్రలో నందిని రెడ్డి తెరకెక్కిస్తోన్న చిత్రం 'మా ఇంటి బంగారం'. తాజాగా ఈ సినిమా టీజర్ ట్రైలర్‌ను విడుదల చేశారు. సమంత అమాయకంగా కనిపిస్తూనే యాక్షన్ సన్నివేశాల్లో తనదైన శైలిలో నటించారు. 1980ల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో రూపొందుతున్నట్లు ఈ వీడియో ఆధారంగా తెలుస్తోంది. ఇందులో సమంతతో పాటు బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య కీలకపాత్రలో నటిస్తున్నారు.




# ఘనంగా సత్య సాయి బాబా రథయాత్ర

- స్వాగతం పలికిన మహిళలు
- ప్రత్యేక ఆకర్షణగా చిన్నారులు కూచిపూడి నృత్యం

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** శ్రీ సత్య సాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర పుట్టపర్తిలో ప్రారంభమై ఐదు రోజులు పూర్తి చేసుకొని గురువారం సాయంత్రం 9.30 గంటలకు వరంగల్ జిల్లాలోని నాయుడు పెట్రోల్ బంకు సమీపానికి చేరుకుంది. ఈ రథయాత్రకు మహిళలు మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి మంగళ హారతులతో స్వామివారి రథానికి ఘనంగా స్వాగతం పలికారు. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు నాయుడు పెట్రోల్ బంప్ నుంచి బయలుదేరి శివనగర్ లోని సత్యసాయి మందిరం చేరుకుంది. అనంతరం భక్తుల కోలాటాలు, చిన్నారుల కూచిపూడి నృత్యాలతో రథయాత్ర ఊరేగింపు వరంగల్ పోస్ట్ ఆఫీస్, చౌరస్తా, ఇంతజార్ గంజ్, మట్టేవాడా, ఓసిటీ, పోచం మైదాన్, ఎంజీఎం, అలంకార్ థియేటర్ మీదుగా సత్యసాయి



మందిరం చేరుకుంది. భోజనానంతరం రథయాత్ర పెట్రోల్ పంపు, అదాలత్ సెంటర్, ఫాతిమా, కాజీపేట, మడికొండ మీదుగా నగరం దాటింది. ఈ రథయాత్ర రాత్రి జవహర్ కాలనీ సురేంద్రపురిలో విశ్రాంతి తీసుకొని ఉదయం అల్పాహారం అనంతరం గోపాలపురం, భీమవరం, హసన్ పర్తి, సీతంపేట, శ్రీరాములపల్లిలో సాయంత్రం వరకు రథయాత్ర జరుగనుంది. అక్కడి నుంచి కరీంనగర్ జిల్లాలో తిరిగి రథయాత్ర నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మహిళా విభాగం సభ్యులు బీవీ సుమతి నాయుడు, సురేష్ నాయుడు, జోష్ణ నాయుడు, సునీత నాయుడు, విజయ నాయుడు, సుంకరి సుజాత దేవి, జిల్లా అధ్యక్షులు గండి వెంకటేశ్వర్లు, వరంగల్ సమితి కన్వీనర్ సీహెచ్ రాజేశ్వరరావు, కోఆర్డినేటర్లు రవి ఆడెపు, సత్యానందం, కే.నరేష్, ఎడ్యుకేషన్ కన్వీనర్ సీహెచ్ రవీందర్, సుధాకర్, బొల్లం శరత్ బాబు, శాలిని, విరాట్, ప్రకాష్ రెడ్డి, చిన్నవల శ్రీనివాస్, భక్తులు హాజరయ్యారు.



## అథ్లెటిక్స్ లో రెసిడెన్షియల్ బాలికల ప్రతిభ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా కేంద్రంలోని జవహర్ లాల్ నెహ్రూ క్రీడా మైదానంలో శుక్రవారం 14 సంవత్సరాల లోపు, 20 సంవత్సరాలలోపు బాల, బాలికలకు నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో తెలంగాణ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు సత్తా చాటారు. అత్యధిక బహుమతులు గెలుచుకుని పాఠశాల కీర్తిని ఇనుమడించారు. తెలంగాణ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలకు చెందిన మనస్వి, శ్రీచ, సోనాక్షి, సాత్విక ప్రతిభ కనబర్చి బహుమతులు సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అథ్లెటిక్ కార్యదర్శి సారంగపాణి, కృష్ణమూర్తి, సాంబమూర్తి, వాసు, రజినీకాంత్, వ్యాయామ ఉపాధ్యాయురాలు నిర్మల, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఐనవోలు జాతరకు పటిష్ట ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి) ఈ సందర్భంగా దేవాదాయ, పంచాయతీ రాజ్, మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, ఇతర శాఖల ఆధ్వర్యంలో ఇప్పటి వరకు చేసిన జాతర ఏర్పాట్లు, వాటి పురోగతి గురించి సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జాతర ఏర్పాట్లు సంబంధిత శాఖలు త్వరగా పూర్తి చేయాలన్నారు. ముందుగా ఆలయానికి వచ్చిన జిల్లా కలెక్టర్ కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారిని కలెక్టర్ దర్శించుకున్నారు. అర్చకులు శేష వస్త్రాలను అందించి ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కమ్మగొని ప్రభాకర్, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి కందుల సుధాకర్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్, సీఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, తహసిల్దార్ విక్రమ్ కుమార్, ఎంపీడీవో నర్మద, ఎస్సై శ్రీనివాస్, ఏఈలు రవికుమార్, సురేష్ కుమార్, ఆలయ ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# పత్రికలు సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలి




- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- 'వరంగల్ వాయిస్' క్యాలెండర్ ఆవిష్కరణ

**వరంగల్ వాయిస్, హనుమకొండ/ఆత్మకూరు :** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న 'వరంగల్ వాయిస్' 2026 వార్షిక క్యాలెండర్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. హనుమకొండలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బంక సంపత్, పత్రికా ప్రతినిధులతో కలిసి ఆయన క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ వాయిస్ పత్రిక తనదైన ముద్రతో సామాజిక కోణంలో వార్తలను అందిస్తూ ప్రజల గొంతుకగా మారడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడుతూ ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.

### ఆత్మకూరు ప్రభుత్వ కళాశాలలో..

మరోవైపు ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం వేడుకగా జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ కవిత, అధ్యాపక బృందం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజ హితం కోసం పత్రికలు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని, వరంగల్ వాయిస్ జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో వరంగల్ వాయిస్ ఎడిషన్ ఇంచార్జి గోలి రవి, స్టాఫ్ రిపోర్టర్ సిద్ధోజు రాకేష్, ఆత్మకూరు రిపోర్టర్ సముద్రాల విజేందర్ పాల్గొన్నారు. ఆత్మకూరు కళాశాల కార్యక్రమంలో స్టాఫ్ సెక్రెటరీ రమాదేవి, అధ్యాపకులు ఎండీ జానీ పాషా, కనకయ్య, లైబ్రేరియన్ దిలీప్, కర్ణాకర్ రెడ్డి, ఐలయ్య, విజయ మోహన్, మల్లయ్య, మల్లికార్జున, రాజు, శ్రీనివాస్, రాంప్రసాద్, షమీమ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్షేమంగా గమ్యం చేరడమే లక్ష్యం

**వరంగల్ వాయిస్, క్రైం :** ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవడమే మనందరి లక్ష్యంగా మార్చుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పిలుపు నిచ్చారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం నగర ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలతో పాటు హెల్మెట్ ప్రాధాన్యతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా వరంగల్ ట్రాఫిక్ పోలీసుల అధ్వర్యంలో బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హజరై జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం పోలీస్ కమిషనర్ తోపాటు సిబ్బంది హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ మైదానం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ హనుమకొండ చౌరస్తా, ములుగు రోడ్, ఎంజీఎం, పోచమ్మమైదానంలోని ఎస్.ఆర్ కళాశాల వరకు సాగింది. అనంతరం విధ్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు పెద్ద సమస్యగా మారాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడమే ఇందుకు ప్రధాన కారణంగా మారుతోందన్నారు. వాహనదారులు వ్యక్తిగత బాధ్యతగా భావించి ట్రాఫిక్ నిబంధనలను పాటించడం అవలంబిస్తే రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చన్నారు. రొడ్డు ప్రమాదాల కారణంగా 450కు పైగా మృత్యువాత పడగా, తొమ్మిది లక్షల మంది వాహనదారులకు హెల్మెట్ ధరించని కారణంగా జరిమానాలు విధించామన్నారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామంటూ విద్యార్థులచేత సీపీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, వరంగల్ ఏఎస్పీ శుభం, అదనపు డీసీపీలు ప్రభాకర్ రావు, శ్రీనివాస్, సురేష్‌కుమార్, ఏసీపీ సత్యనారాయణ, ప్రశాంత్ రెడ్డి, సురేంద్ర, నాగయ్య, జాన్ నర్సింహులతో పాటు ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్లు సీతారెడ్డి, వెంకన్న, సుజాతతో పాటు నగరానికి చెందిన ఇన్ స్పెక్టర్లు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు పోలీస్ సిబ్బంది, స్థానిక యువత ఈ ర్యాలీ ఉత్సహంగా పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT. TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com